క్లుప్తంగా

పేద ముస్లింలకు దుస్తుల పంపిణీ



దుస్తుల పంపిణీలో సంఘ సభ్యులు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): సమాజసేవ చేయాలనే తపన ప్రతి ఒక్కరిలో ఉండాలని శ్రీ చక్ర సేవా సంఘం అధ్యక్షుడు బి.కోటీశ్వర మొదలియార్ అన్నారు. నగరంలోని పలమనేరు రోడ్డులోని సంఘం కార్యాలయంలో గురువారం రంజాన్ పండుగ నేపథ్యంలో సంఘం ఆధ్వర్యంలో పేద ముస్లింలకు దుస్తులు, బియ్యం పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంఘసేవకులు తోటు గోవిందన్, ఆనందనాయుడు, భూపతి, రఘునాథం, నరేంద్ర, నాగరాజ, షణ్ముగం, జయప్రకాష్, సి.రోహిత్, ఖాన్, షఫీ, మురాజ్, బురకతుల్లా, టి.మంజులాదేవి పాల్గొన్నారు.

‘అవని’ పథకం సద్వినియోగం చేసుకోండి

చిత్తూరు రూరల్ (కాణిపాకం): మహిళలు అధిక రాబడి పొందే విధంగా అవని డిపాజిట్ పథకం అమలు చేస్తున్నామని, జిల్లా సహకార కేంద్ర బ్యాంకు, గిరింపేట బ్యాంక్ బ్రాంచ్ మేనేజర్ రఘు తెలిపారు. అవని డిపాజిట్ స్వీకరణ ఈనెల 31తో ముగియనుందన్నారు. డిపాజిట్లకు ఇన్సూరెన్స్ రక్షణ ఉందన్నారు. ఇందులో వాణిజ్య బ్యాంకుల కంటే అదనపు వడ్డీ పొందవచ్చన్నారు.

పిల్లల సమగ్రాభివృద్ధికి కృషి



అంగన్‌వాడీ కార్యకర్తలకు సర్టిఫికెట్లు అందజేస్తున్న సూపర్‌వైజర్లు

బంగారుపాళెం: అంగన్‌వాడీ కార్యకర్తలు పిల్లల సమగ్రాభివృద్ధికి కృషి చేయాలని ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీఓ వాణి శ్రీదేవి పేర్కొన్నారు. పోషణ బీ- పడాయి కార్యక్రమంలో భాగంగా మండలంలోని తుంబకుప్పం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో అంగన్‌వాడీ కార్యకర్తలకు ఇస్తున్న శిక్షణ గురువారంతో ముగిసింది. శిక్షణలో నేర్చుకున్న అంశాలపై అవగాహన పెంచుకుని కేంద్రాలను సక్రమంగా నడపాలని కోరారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు జయశ్రీ, రెడ్డి, కళ్యాణి, బంగారుపాళెం, తుంబ కుప్పం సెక్టార్ల అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

అర్ధగిరికి రూ.6.65 లక్షల హుండీ ఆదాయం



హుండీ కానుకలు లెక్కిస్తున్న ఆలయ సిబ్బంది

తవణంపల్లె: అర్ధగిరి శ్రీ వీరాంజనేయ స్వామి దేవస్థానంలో హుండీ కానుకల ద్వారా రూ.6,65,742 ఆదాయం వచ్చినట్లు ఈఓ హనుమంతురావు తెలిపారు. గురువారం అర్ధగిరి క్షేత్రంలోని మండపంలో ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ సుమన ప్రియ పర్యవేక్షణలో హుండీ కానుకల లెక్కింపు నిర్వహించారు. జనవరి 23వ తేదీ నుంచి మార్చి 27 (గురువారం) వరకు హుండీల్లో వచ్చిన కానుకలను లెక్కించినట్లు వివరించారు.

ఇష్టానుసారం నిధులు కేటాయించొద్దు

- కౌన్సిల్ జవాబుదారీతనంగా ఉండాలి
- డివిజన్లలో ప్రోటోకాల్ పాటించడం లేదు
- ప్రభుత్వాసుపత్రిలో మనుషుల్ని చంపేస్తున్నారు
- మార్కెట్ గేటు వసూళ్లపై ఫ్లెక్సీలు ఏర్పాటు చేయండి
- చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్ కౌన్సిల్‌లో..
- డిప్యూటీ మేయర్.. సభ్యుల హితవు



సమస్యలు ప్రస్తావిస్తున్న డిప్యూటీ మేయర్ చంద్రశేఖర్



మాట్లాడుతున్న మేయర్ అముద

చిత్తూరు అర్బన్: కౌన్సిల్ అంటే ప్రజలకు ప్రభుత్వానికి జవాబుదారీతనంగా ఉండాలని, మరొకరు వేలెత్తి చూపించేలా ఉండకూడదని చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ చంద్రశేఖర్ సూచించారు. ముందస్తు అనుమతుల పేరిట ఇష్టానుసారం సంతకాలు తీసుకుంటే మేయర్‌తోపాటు సభ్యులు, అధికారులు భవిష్యత్తులో ఇబ్బందులు పడే అవకాశం ఉందని హితవు పలికారు. గురువారం చిత్తూరు కార్పొరేషన్ కార్యాలయంలో మున్సిపల్ కౌన్సిల్ సమావేశం మేయర్ అముద ఆధ్వర్యంలో నిర్వహించారు. పలువురు సభ్యులు వారి సమస్యలను మేయర్, అధికారుల దృష్టికి తీసుకెళ్లారు.

ఇందులో ప్రధానంగా..

- డిప్యూటీ మేయర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ ‘నగరంలో రోడ్లు వేసేందుకు రూ.లక్షల్లో టెండర్లు పిలుస్తున్నారు. పంచాయతీరాజ్, ఆర్అండ్‌బీ రోడ్ల వేయడానికి మున్సిపల్ నిధులు వెచ్చిస్తూ, మేయర్ వద్ద ముందస్తు అనుమతులు తీసుకుంటున్నారు. దీంతో భవిష్యత్తులో అభ్యంతరాలు తలెత్తి, చిక్కుల్లో పడే అవకాశం ఉంది. మేయర్ కూడా జవాబు చెప్పాల్సి ఉంటుంది. 20వ డివిజన్‌లో పనులు చేయడానికి పూతలపట్టు ఎమ్మెల్యే సూచించారని చెబుతున్నారు. ఆ ప్రాంతం ఎమ్మెల్యే పరిధిలో లేదు. కనీసం అక్కడి కార్పొరేటర్‌కు విషయం చెప్పలేదు. ఆర్అండ్‌బీ రోడ్డుకు సంబంధించిన పీసీఆర్ పాఠశాల వద్ద రూ.27 లక్షలు వెచ్చించి దుకాణాలు నిర్మించడం ఏంటి? దాతలు ఉచిత విద్యకు ఇచ్చిన స్థలంలో వ్యాపారాలు ఎలా నిర్వహిస్తారు? కోర్టు ప్రహరీ గోడ నిర్మించడానికి మున్సిపల్ నిధులు కేటాయించడం ఏంటి?’ అని ప్రశ్నించారు. నగరంలో రోడ్డు విస్తరణకు భవన యజమానులకు పరిహారం ఇవ్వాలన్నారు. మార్కెట్ గేటు పేరిట సామాన్యులను దోచేస్తున్న వైనాన్ని అడ్డుకట్ట వేయడానికి నగరంలో ఎవరు ఎంత గేటు చెల్లించాలో బోర్డులు పెట్టాలని, ఉల్లంఘిస్తే చర్యలు తీసుకోవాలని కోరారు.
- వైఎస్సార్ సీపీ కార్పొరేటర్ దళవాయి సునీత మాట్లాడుతూ తాను కార్పొరేటర్‌గా ఉంటే, తనవార్డులో జరిగే ఏ ఒక్క కార్యక్రమానికి సమాచారం ఇవ్వడం లేదన్నారు. కనీస మర్యాద ఇవ్వడం లేదని, ప్రోటోకాల్ పాటించడం లేదన్నారు. ఆఖరుకు పంపు ఆపరేటర్ కూడా ప్రజలకు నీళ్లు వదలమంటే వినడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.
- వైఎస్సార్ సీపీ కార్పొరేటర్ శోభా మాట్లాడుతూ తన వార్డు పరిధిలో టెండర్లు పిలిచి, నీటిపైపు లైను పనులు చేయాల్సి ఉంటే.. కొందరు పనులు అడ్డుకుంటున్నారన్నారు. మరో కార్పొరేటర్ భాగ్యలక్ష్మి రెడ్డి మాట్లాడుతూ భరత్‌నగర్, ఎంఎస్.గార్డెన్‌తో కలిపి నాలుగ చోట్ల నీటిబోర్లు డ్రిల్ చేయాలన్నారు. కార్పొరేటర్ హరిణిరెడ్డి తన వార్డులో వీధి దీపాలు సక్రమంగా వెలగడంలేదని, సచివాలయం వద్దే గుర్తుతెలియని వ్యక్తులు మద్యం సేవిస్తున్నారన్నారు. పీసీఆర్ కూడలి వద్ద మహిళల భద్రతకు పోలీస్ పికెటింగ్ పెట్టాలన్నారు. కార్పొరేటర్ ఇందు మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రిలో పేదలకు మెరుగైన వైద్యం అందడంలేదన్నారు. డ్యూటీలో ఉన్న జూనియర్లకు వైద్యం చేతగాక ప్రజల ప్రాణాలతో ఆడుకుంటున్నారన్నారు. సభ్యులు ప్రస్తావించిన సమస్యలను సకాలంలో పరిష్కరిస్తామని కమిషనర్ నరసింహ ప్రసాద్ హామీ ఇచ్చారు. సహాయ కమిషనర్ ప్రసాద్, ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు వెంకటరామిరెడ్డి, పట్టణ ప్రణాళిక అధికారి నాగేంద్ర, ప్రజారోగ్యశాఖ అధికారి డాక్టర్ లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

విధులు సక్రమంగా నిర్వర్తించాలి



మాట్లాడుతున్న డీఎంఅండ్‌హెచ్ఓ సుధారాణి

చిత్తూరు రూరల్ (కాణిపాకం): ఆరోగ్య కార్యకర్తలు విధులు సక్రమంగా నిర్వర్తించాలని డీఎంఅండ్‌హెచ్ఓ డాక్టర్ సుధారాణి పేర్కొన్నారు. చిత్తూరు నగరంలోని తన కార్యాలయంలో గురువారం ఒక్కరోజు సాంకేతిక మార్గదర్శక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. దోమకాటుతో వచ్చే వ్యాధులు మలేరియా, డెంగీ, ఫైలేరియా మెదడు వాపు రాకుండా తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలపై శిక్షణ ఇచ్చారు. విధుల్లో అలసత్వం ఉండాలన్నారు. రికార్డులను పక్కాగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా మలేరియా అధికారి వేణుగోపాల్, డీపీఎంఓ ప్రవీణ తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ సమస్యలను తక్షణం పరిష్కరించండి

యాదమరి: రెవెన్యూ సమస్యలను సత్వరమే పరిష్కరించాలని తహసీల్దార్ పార్థసారథి వీఆర్ఓ లకు సూచించారు. గురువారం కార్యాలయంలో మాట్లాడుతూ ఆయా గ్రామాల పరిధిలోని సమస్యలను పరిశీలించి వివాదాలకు చోటు లేకుండా చూడాలన్నారు. రీ సర్వేకి సంబంధించిన వినతులపై చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రాలు జారీ చేయడంలో అలసత్వం తగదని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్, వీఆర్వోలు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఎంపీపీ ఎన్నిక

- ఏకగ్రీవంగా ఎన్నికైన ప్రతాప్‌సుందర్ రాయల్‌రెడ్డి



ఎంపీపీగా ప్రతాప్ సుందర్‌రాయల్ రెడ్డికి ధ్రువీకరణపత్రాన్ని అందజేస్తున్న అధికారులు

తవణంపల్లె: ఎన్నికల రిటర్నింగ్ అధికారి శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఎంపీపీ ఎన్నిక ప్రశాంత జరిగింది. మండలంలోని ఎంపీటీసీలు 14 మంది ఎన్నికల హాల్లోకి చేరుకోగానే 11 గంటలకు ఎంపీపీని ఎన్నుకోవాలని రిటర్నింగ్ అధికారి ఎంపీటీసీ సభ్యులకు సూచించారు. మల్లకుంట ఎంపీటీసీని తవణంపల్లె ఎంపీపీగా ప్రతాప్ సుందర్‌రాయల్ రెడ్డిని ఎంపీటీసీ సభ్యురాలు గీతారెడ్డి ప్రతిపాదించారు. తర్వాత ఎంపీటీసీ డేవిడ్ ప్రతాప్ సుందర్‌రాయల్ రెడ్డిని బలపరిచారు. ఎంపీపీకి పోటీగా ఎవరూ లేకపోవడంతో ఏకగ్రీవంగా ఎన్నికల రిటర్నింగ్ అధికారి శ్రీనివాసులు తవణంపల్లె మండల ఎంపీపీగా ప్రతాప్ సుందర్‌రాయల్‌రెడ్డిని ప్రకటిస్తూ ధ్రువీకరణ పత్రాన్ని అందజేశారు. అనంతరం ఎంపీపీగా ఆయన చేత ప్రమాణ స్వీకారం చేయించారు. ఎంపీపీగా ఏకగ్రీవంగా ఎన్నికైన ఆయనకు ఎంపీటీసీ సభ్యులు, మండల విప్, అధికారులు, వైఎస్సార్‌సీపీ నాయకులు అభినందించారు. ఈ ఎన్నికలో ఎంపీడీఓ రెడ్డి బాబు, తహసీల్దార్ సుధాకర్ పాల్గొన్నారు.

భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు

తవణంపల్లె ఎంపీపీ ఎన్నిక నేపథ్యంలో చిత్తూరు రూరల్ సీఐ శ్రీధర్‌నాయుడు, తవణంపల్లె ఎస్ఐ చిరంజీవి ఆధ్వర్యంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. మల్లకుంట ఎంపీటీసీగా ఎన్నికైన ప్రతాప్ సుందర్‌రాయల్ రెడ్డి వైస్ ఎంపీపీ-2గా కొనసాగుతూ రెండున్నరేళ్ల తర్వాత అధికారికంగా ఎంపీపీగా ఏకగ్రీవంగా ఎన్నిక కావడంపై పలువురు హర్షం వ్యక్తం చేశారు.

మండల అభివృద్ధికి కృషి చేస్తా : ఎంపీపీ

ఎంపీటీసీ సభ్యులు, అధికారులు, పార్టీ నాయకులను సమన్వయం చేసుకొని మండల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని ఎంపీపీ ప్రతాప్ సుందర్ రాయల్ రెడ్డి స్పష్టం చేశారు.

వైఎస్సార్ సీపీ బలోపేతానికి కృషి

తవణంపల్లె: వైఎస్సార్ సీపీకి నాయకులు, కార్యకర్తలు కలసికట్టుగా పనిచేసి బలోపేతం చేయాలని పూతలపట్టు నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ సునీల్‌కుమార్ పిలుపునిచ్చారు. గురువారం తవణంపల్లె పార్టీ కార్యాలయంలో ఏకగ్రీవంగా ఎన్నికైన తవణంపల్లె ఎంపీపీ ప్రతాప్ సుందర్ రాయల్ రెడ్డిని సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా సునీల్‌కుమార్ మాట్లాడుతూ.. ఎంపీపీ ఎన్నికల్లో కలసికట్టుగా పనిచేసి ఏకగ్రీవంగా ఎంపీపీని కైవసం చేసుకొని తమ సత్తా చాటారన్నారు. ప్రతాప్‌రెడ్డి ప్రజలకు అందుబాటులో ఉంటూ అధికారుల సహకారంతో మరింత సేవలందించాలని ఆయన ఆకాంక్షించారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ హరిరెడ్డి, పార్టీ నాయకులు హరికృష్ణారెడ్డి, రమణారెడ్డి, మధుకుమార్, రవిరెడ్డి, పరమేశ్వరరెడ్డి, గోవర్ధన బాబు, రాజశేఖర్ రెడ్డి, రంజిత్ రెడ్డి, విజయ్, దామోదరం, విజయ్‌రెడ్డి, మధుసూదన్ రెడ్డి, మురుగన్, పరదేశి, చిట్టిబాబు, సుధాకర్, ప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.

మైనారిటీల ఆస్తుల దోపిడీకి కుట్ర



ఇఫ్తార్ విందులో విజయానందరెడ్డి తదితరులు

చిత్తూరు కార్పొరేషన్: జగనన్న పాలనలో మైనారిటీలకు మేలు జరిగితే టీడీపీ పాలనలో వారి ఆస్తులను దోచుకోవడానికి కుట్ర చేస్తున్నారని వైఎస్సార్ సీపీ చిత్తూరు నియోజకవర్గ సమన్వయకర్త విజయానందరెడ్డి తెలిపారు. నగరంలోని సంతపేటలో ఆ పార్టీ మొదలియార్ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు జ్ఞానజగదీష్ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వచ్చి ఆయన మాట్లాడారు. చిత్తూరులోనే వక్ఫ్ ఆస్తులను ఆక్రమించుకోవడానికి టీడీపీ నాయకులు యత్నిస్తున్నారన్నారు. పిఠాపురం సభలో ఇటీవల డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ మతవిద్వేషాలు రెచ్చగొట్టే విధంగా మాట్లాడారన్నారు. గతంలో చిత్తూరులో తన సొంత నిధులతో ముస్లింలకు రంజాన్ పండుగ నాడు తోఫా ఇచ్చామన్నారు. నగరంలోని షాదీమహల్‌కు గ్రానైట్‌తో ఫ్లోరింగ్ వేయించామని గుర్తు చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ చంద్రశేఖర్, చుడా మాజీ చైర్మన్ పురుషోత్తంరెడ్డి, పార్టీ నగర అధ్యక్షుడు కేపీ శ్రీధర్, నాయకులు మస్తాన్‌ఖాన్, చాన్‌బాషా, ఆను, నౌషాద్, అఫ్జల్‌ఖాన్, అల్తాఫ్, చాపు, చామంతి, ఇబ్రాన్, సద్దాం, త్యాగ, మనోజ్‌రెడ్డి, నారాయణ, రాంగణేష్, అప్పాజీ, ద్వారకా, రాజేష్‌రెడ్డి, చంద్ర, రంజిత్, రాజేష్, శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన శిక్షణ

యాదమరి: పోషణ్ 2.0లో భాగంగా అంగన్‌వాడీ కార్యకర్తలకు నిర్వహించిన మూడు రోజుల శిక్షణ గురువారంతో ముగిసింది. మండలంలోని కె.గొల్లపల్లి ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ఈ శిక్షణకు సీడీపీఓ వాణిశ్రీ దేవి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పిల్లలందరూ సమగ్రాభివృద్ధి సాధించడానికి అవసరమయ్యే ప్రేరణ కలగ చేయాలని సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు లలిత, సరళ కుమారి, కవిత, మమత, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రదోష పూజలు



పూజలు చేస్తున్న అర్చకులు

కాణిపాకం: కాణిపాక శ్రీ వరసిద్ధి వినాయకస్వామి దేవస్థాన అనుబంధ దేవాలయమైన శ్రీ మణికంఠేశ్వర స్వామి ఆలయంలో గురువారం రాత్రి ప్రదోష పూజలను జరిపించారు. ఈ సందర్భంగా స్వామివారి మూలవిరాట్, నందికి ప్రత్యేక అభిషేకం, విశేష పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఈఓ పెంచల కిషోర్, సూపరింటెండెంట్ కోదండపాణి, వాసు, అర్చకులు, వేద పండితులు పాల్గొన్నారు.

నైపుణ్యాభివృద్ధే లక్ష్యం



శిక్షణకు హాజరైన అంగన్‌వాడీ కార్యకర్తలు

ఐరాల: పిల్లల్లో నైపుణ్యాభివృద్ధి పెంపే లక్ష్యంగా అంగన్‌వాడీ కార్యకర్తలు పనిచేయాలని సీడీపీఓ నిర్మల ఆదేశించారు. పొలకల జెడ్పీ హైస్కూల్‌లో గురువారం పోషణ్ బీ- పడాయ్ బీ కార్యక్రమంలో భాగంగా మండలంలోని అంగన్‌వాడీ కార్యకర్తలకు మూడో రోజు శిక్షణ ఇచ్చారు. కిశోర బాలికలపై ప్రత్యేక శ్రద్ధ వహించడంతో పాటు బాల్య వివాహాలు నిరోధించడం, విద్య ప్రాధాన్యంపై ఎప్పటికప్పుడు అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు మంజుల, లావణ్య పాల్గొన్నారు.

పాస్టర్ మృతికి నిరసన



నిరసనలో పోరాట సమితి సభ్యులు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): పాస్టర్ ప్రగడాల ప్రవీణ్ మృతికి కారకులైన వారిని గుర్తించి కఠినంగా శిక్షించాలని దళిత హక్కుల పోరాట సమితి ఉపాధ్యక్షుడు నాగరాజు డిమాండ్ చేశారు. చిత్తూరు నగరంలోని దర్గా సర్కిల్‌లో గురువారం పాస్టర్ మృతికి నిరసన వ్యక్తంచేశారు. కార్యక్రమంలో నాయకులు మహేష్, చంద్ర, గోపినాథ్, మణి, విజయకుమార్, ముత్తు, ప్రకాష్, సతీష్, చంద్రయ్య పాల్గొన్నారు.

నోటి శుభ్రతతో ఆరోగ్యం



అవగాహన ర్యాలీ చేస్తున్న వైద్య సిబ్బంది

ఐరాల: ఆరోగ్యంగా ఉండాలంటే తప్పనిసరిగా నోటిని శుభ్రంగా ఉంచుకోవాలని పి.కొత్తకోట దంత వైద్య నిపుణుడు డాక్టర్ వెంకటరావు అన్నారు. స్థానిక పీహెచ్‌సీలో వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్, డాక్టర్ పూర్ణలత ఆధ్వర్యంలో ఆయన గురువారం ప్రపంచ నోటి ఆరోగ్య దినోత్సవం సందర్భంగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ వెంకటరావు మాట్లాడుతూ.. నోటి ఆరోగ్యం కోసం ఐదు నియమాలు పాటించాలన్నారు. దంతాలకు సంబంధించి ఎటువంటి చిన్న సమస్య ఉన్నా సమీపంలోని పి.కొత్తకోట సామాజిక ఆరోగ్య కేంద్రానికి వస్తే ఉచితంగా వైద్యసేవలు అందిస్తామని తెలిపారు. అనంతరం వైద్య సిబ్బందితో కలిసి ఆయన మండల కేంద్రంలో అవగాహన ర్యాలీ చేశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పంటలపై వన్యమృగాల దాడులు



అడవి పందులు నాశనం చేసిన వరి పంట

గుడిపాల: పంట చేతికి వస్తుందనుకుంటున్న సమయంలో ఓవైపు వానరాలు.. మరోవైపు అడవి పందులు పంటలను నాశనం చేస్తున్నాయి. దీంతో రైతన్నలు లబోదిబోమంటున్నారు. గుడిపాల మండలంలోని బొమ్మసముద్రం, చింతగుంటూరు, కోటూరు, వసంతాపురం, బసవాపల్లె గ్రామాల్లో రైతులు వేసుకొన్న బీన్స్, బెండ, వంకాయ, టమాటా, అరటి పంటలను వానరాలు నాశనం చేస్తున్నాయి. దీంతో పాటు కొబ్బరిచెట్లలో ఉన్న కొబ్బరికాయలను కూడా వదిలి పెట్టడం లేదని రైతన్నలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో పాటు బండపల్లె, అడవిచేను, వెప్పాలమానుచేను, చిత్తపార ప్రాంతాల్లో అడవిపందులు వరి పంటను ధ్వంసం చేస్తున్నాయి. దీంతో దిక్కుతోచని స్థితిలో రైతన్నలు ఉన్నారు. సంబంధిత అధికారులు అడవిపందులు, వానరాలు పొలాల్లోకి రాకుండా ఉండేందుకు తగు సూచనలు, సలహాలు ఇవ్వాలని రైతన్నలు డిమాండ్ చేస్తున్నారు.

ఫ్యామిలీ డాక్టర్ ఉపయోగకరం



గుడిపాల: వైద్యసేవలు అందిస్తున్న డాక్టర్ రక్షిత

గుడిపాల: ఫ్యామిలీ డాక్టర్ సేవలను ప్రజలు వినియోగించుకోవాలని బొమ్మసముద్రం డాక్టర్ రక్షిత అన్నారు. మండలంలోని వెంగమాంబపురం గ్రామంలో గురువారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. వివిధ వైద్య పరీక్షలు చేసి అవసరమైన వారికి ఉచితంగా మందులను అందజేశారు. అనంతరం ఇంటివద్ద మంచాన పడ్డ రోగుల వద్దకు వెళ్లి వారికి కావాల్సిన వైద్యసేవలను అందజేశారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది హైమావతి, స్వర్ణ, సుమతి, శ్రీలక్ష్మి, పవన్, కార్తినా పాల్గొన్నారు.

రేపు అపోలో ఆసుపత్రిలో ఉచిత వైద్య శిబిరం

తవణంపల్లె: మండలంలోని అరగొండ అపోలో హాస్పిటల్లో శనివారం ఉదయం 11 గంటల నుంచి 3 గంటల వరకు ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తామని హాస్పిటల్ మేనేజర్ చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. ప్రముఖ యూరాలజిస్టు, సర్జన్ డాక్టర్ హెచ్.ఎస్. శంకర్ రోగులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తారని పేర్కొన్నారు. కిడ్నీలలో రాళ్లకు యుఆర్ఎస్ఎల్, పీసీఎన్ఎల్, ఆర్ఐఆర్ఎస్ ద్వారా ఎండోస్కోపిక్ ఆపరేషన్లు, కిడ్నీ క్యాన్సర్, కిడ్నీ వాపునకు లాప్రోస్కోపిక్ ఆపరేషన్లు, చిన్న పిల్లల్లో ప్రోస్టేట్ క్యాన్సర్, యూరిన్ ఇన్‌ఫెక్షన్, మూత్రంలో రక్తం రావడం, మూత్రాశయం క్యాన్సర్, యూరాలజీ సమస్యలు, స్త్రీలకు కిడ్నీల్లో, మూత్రాశయం సంబంధించి అన్ని వ్యాధులకు ఉచితంగా పరీక్షలు నిర్వహిస్తామన్నారు.

లిటిల్‌రోస్‌లో కార్నివాల్

చిత్తూరు కలెక్టరేట్: నగరంలోని సంతపేట రోడ్డు ఇందిరా నగర్‌లోని లిటిల్ రోస్ పాఠశాలలో ఈ నెల 28, 29 తేదీల్లో కార్నివాల్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు కరస్పాండెంట్ గోపాలకృష్ణమూర్తి తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ నెల 28 న సంకల్ప్ ప్రోగ్రామ్‌లో ఇంగ్లీష్ ఫెస్ట్, అబాకస్, కలరింగ్, డ్రాయింగ్, జనరల్ నాలెడ్జ్, క్విజ్ మొదలైన పోటీలు ఉంటాయన్నారు. ఈ నెల 29 న ఆవిష్కార్ ప్రోగ్రామ్‌లో మెడికల్ క్యాంప్, సైన్స్ ఫెయిర్, ప్లానెటోరియం, బౌన్స్ హౌస్, ట్రాంపోలిన్ తదితర కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఈ పోటీల్లో విజేతలైన విద్యార్థులకు బహుమతులు ఇవ్వనున్నట్లు ఆయన వెల్లడించారు.

పాడి పోషణతో ఆర్థికాభివృద్ధి



రైతులకు బహుమతి ప్రదానం చేస్తున్న ఎమ్మెల్యేలు, అధికారులు

బంగారుపాళెం: పాడి పోషణతో ఆర్థికాభివృద్ధి సాధించాలని పూతలపట్టు, చంద్రగిరి ఎమ్మెల్యేలు మురళీమోహన్, పులివర్తి నాని పేర్కొన్నారు. గురువారం మండలంలోని మిట్టపల్లెలో పశుసంవర్ధకశాఖ, పశుగణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో సంకర జాతి జెర్సీ, హెచ్ఎఫ్ లేగదూడల ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యేలు మాట్లాడుతూ.. పాడి పశువులపై రైతులు ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. జాయింట్ డైరెక్టర్ ఆరీఫ్ మాట్లాడుతూ.. వేసవిలో పశువుల యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు. ప్రదర్శనకు తీసుకొచ్చిన దూడలను ఎంపిక చేసి రైతులకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ రమేష్, ఏడీలు డాక్టర్ ఆసిఫ్, విజయమోహన్, పశువైద్యులు జాన్సీ, సుబ్బారావు, వీఎల్ఓలు, నాయకులు, రైతులు పాల్గొన్నారు.

నేత్రాల నేస్తాలు!

- కూలింగ్ అద్దాలతో కంటికి రక్షణ
- పెరుగుతున్న వేసవి ఉష్ణోగ్రతలు
- కూలింగ్ కళ్లజోడు శ్రేయస్కరం
- జాగ్రత్తలు సూచిస్తున్న కంటి నిపుణులు



షాప్‌లో కూలింగ్ కంటి అద్దాలు

బంగారుపాళెం: వేసవిలో శరీరంతో పాటు కళ్ల మీద కూడా శ్రద్ధ చూపాలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. గొంతెండిపోతే గుక్కెడు నీరు , ఇతర పానీయాలు తీసుకొని సేద తీరుతాం. కానీ కళ్ల గురించి మాత్రం పెద్దగా పట్టించుకోం. కళ్లపై అశ్రద్ధ, నిర్లక్ష్యం కంటి వ్యాధులకు కారణమవుతాయని వైద్యులు చెబుతున్నారు. వేసవిలో సరైన కంటి జాగ్రత్తలు తీసుకోకపోతే ప్రమాదమని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. అత్యవసర సమయంలో ఎండలో తిరిగే ప్రతి ఒక్కరూ చలువ కళ్లజోళ్లు (కూలింగ్ గ్లాసెస్) తప్పనిసరిగా వాడాలి

వేడితో ప్రమాదం

కళ్లలో అతి సున్నితమైన భాగాలకు వేడి తగలడంతో చూపు మందగించే ప్రమాదం ఉంది. శరీర భాగాల్లో కళ్లు ఎంతో ప్రధానమైనవి. మిట్ట మధ్యాహ్నం లేదా ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్న సమయంలో ప్రయాణం చేయడం కంటికి మంచిది కాదు. తప్పనిసరి పరిస్థితుల్లో వాహనం నడిపితే హెల్మెట్, లేదా కళ్ల జోడును తప్పనిసరిగా పెట్టుకోవాలి. దుమ్ము, దూళి కంటిలో పడడం వల్ల విపరీతమైన కంటి దురదలు ఏర్పడుతాయి. కంటిలో నల్ల గుడ్డు చుట్టూ పొరలు రావడం, ఎర్రని చారలు, కంటి వెంట నీరు కారడం జరుగుతుంది. ఇటువంటి సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకోకపోతే ఒక్కోసారి జీవితాంతం చూపు కోల్పోయే ప్రమాదం ఉంటుంది.

కళ్లు నలపకూడదు

మధ్యాహ్నం సమయంలో ఎండ చాలా తీవ్రంగా ఉంటుంది. కళ్లకు రక్షణ కవచాలు లేకుండా తిరిగితే మంట పుట్టడంతో పాటు కళ్లు ఎర్రబడతాయి. ఇటువంటి సందర్భాల్లో కళ్లను చల్లటి నీటితో శుభ్రం చేసుకోవాలి. వెంటనే సమీపంలోని కంటి వైద్యులను సంప్రదించాలి. కళ్లను నలపడం చేయరాదు. తీవ్రమైన ఎండలో బయటకు వెళ్లాల్సి వచ్చినప్పుడల్లా చలువ కళ్లజోళ్లు ఉపయోగించాలి. బైక్, కారు మరేదైనా వాహనం నడుపుతున్నప్పుడు సన్ గ్లాసెస్ ధరించడం వల్ల దుమ్ము కణాలు లేదా వేడి గాలి కళ్లలోకి రాకుండా చేస్తుంది. ద్విచక్ర వాహన దారులు వీలైనంత వరకు క్లోజ్డ్ హెల్మెట్లను వాడటం మంచిది. 100 శాతం యూవీ రక్షణను అందించే నాణ్యమైన సన్ గ్లాసెస్‌ని వాడాలి. యూవీ కిరణాలు కళ్లను దెబ్బతీస్తాయి. ఇది కంటి శుక్లం, మాక్యులార్ డీజెనరేషన్ వంటి సమస్యలకు దారితీస్తుంది.

సమతుల ఆహారం

కంటి చూపు మెరుగు పరుచుకోవడానికి సమతుల ఆహారం తీసుకోవడం చాలా ముఖ్యం. ప్రధానంగా తీసుకునే ఆహారంలో ఎక్కువగా యాంటీ ఆక్సిడెంట్లు, ఏ, సీ విటమిన్లు ఉండేలా చూసుకోవాలి. ముఖ్యంగా ఆకుకూరలు అధిక మొత్తంలో తీసుకోవాలి. అలాగే ఒమెగా-3 కొవ్వు ఆమ్లాలు అధికంగా ఉండే చేపలు తీసుకోవాలి. ఇవి కంటి చూపు మెరుగు పడేందుకు దోహదపడతాయి.

జాగ్రత్తలు పాటించాలి

వేసవిలో ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటుంది. ద్విచక్ర వాహనాలపై ప్రయాణించినప్పుడు వేసవిలో ఎండ ప్రభావంతో వచ్చే వెలుతురు, వేడికి కళ్లకు తగిన జాగ్రత్తలు తీసుకోకపోవడం వల్ల కళ్లలోని రక్షణ పొర కరిగిపోయి, కళ్లు ఫొటో సెన్సిటివిటీకి గురవుతాయి. దాంతో కళ్లు మరింత సున్నితమైపోయి, క్రమేపీ వెలుగును చూడలేని స్థితికి చేరుకుంటాయి. ఇలాంటి సమస్యలు తలెత్తకుండా బయటకు వెళ్లినప్పుడు చలువ కళ్లద్దాలు, హెల్మెట్, టోపీ, రుమాలు తదితర వాటిని ధరిస్తూ జాగ్రత్తలు పాటించాలి.

– డాక్టర్ లోహిత్ చెంగల్‌రాయన్, మెడికల్ ఆఫీసర్, తుంబకుప్పం పీహెచ్‌సీ